## పెట్రోల్‌లో నీళ్లు

**తహసీల్దార్‌కి వాహనదారుడి ఫిర్యాదు**



పెట్రోల్‌లో నీళ్లను చూపుతున్న యువకులు

లక్షెట్టిపేట, జూన్ 27 : పట్టణంలోని ఓ పెట్రోల్ పంప్‌లో స్థానికుడైన డెన్ని తన బైక్‌లో గురువారం రూ. 200 పెట్రోల్ పోయించుకోగా, కొంత దూరం వెళ్లాక ఆగిపోయింది. దీంతో తహసీల్దార్ రాఘవేంద్ర రావుకు ఫిర్యాదు చేయడంతో, ఆయన పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశాడు. పంపులో ఉన్న పెట్రోల్ శాంపిల్స్ సేకరించారు. బంక్ యజమాని తన తప్పేమీ లేదని, టెక్నికల్ ప్రాబ్లం అయి ఉంటుందని, టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేశామని తహసీల్దార్‌కు వివరణ ఇచ్చాడు. అంతేగాకుండా వాహన యజమానికి తన నుంచి ఎలాంటి నష్టం జరుగకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**కుమారుడి చదువుకోసం దాచిన రూ. లక్ష కాలిబూడిద**


రోదిస్తున్న సుధాకర్ కుటుంబం

కన్నెపల్లి, జూన్ 27 : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమవ్వడమేగాక.. కుమారుడి చదువుకోసం దాచిన రూ. లక్ష కాలిబూడిదవ్వడంతో ఆ తల్లి దండ్రులిద్దరూ కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా భీమిని మండలం వెంకటాపూర్‌లో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన అంబలిపు సుధాకర్ కుటుంబం రేకుల ఇంట్లో ఉంటోంది. గురువారం ఉదయం సుధాకర్‌తో పాటు అతడి భార్య నాగక్క పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో ఇంటికి నిప్పు అంటుకున్నది. గ్రామస్తులు మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా, గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు మొత్తం దగ్ధమైంది. తన కుమారుడు అజయ్‌ని ప్రస్తుతం ఇంటర్‌లో చేర్పించేందుకు దాచిన రూ. లక్షతో పాటు బట్టలు, ఫర్నిచర్, నిత్యావసరుకులు కాలిబూడిదయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కన్నెపల్లి ఎస్ఐ గంగారాం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాదాపు రూ. 5 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు ఆర్ఐ తెలిపారు.

# మంచిర్యాలకు నీటిగండం

**ఎల్లంపల్లి ఎండుతోంది**


ఎండిపోతున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు

- ఎల్లంపల్లి ప్రాజెక్టులో తగ్గుతున్న నీటిమట్టం
- ప్రస్తుతమున్నది నాలుగు టీఎంసీలే
- కేవలం పది రోజులకే సరిపడా నిల్వలు
- తెలంగాణ ఏర్పడిన పదేళ్లలో తొలిసారిగా కటకట
- కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతో తిప్పలు తప్పేలా లేవు
- ప్రస్తుతం కొనసాగుతున్న నీటి మళ్లింపు పనులు


పంప్‌హౌస్‌కు నీటి సరఫరా చేసేందుకు కాల్వను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్లు

మంచిర్యాల, జూన్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎల్లంపల్లి ఎండిపోతుండగా, మంచిర్యాల జిల్లాకు తాగు నీటి గండం పొంచి ఉన్నది. కేసీఆర్ హయాంలో నిండు కుండలా దర్శనమిచ్చిన ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం పది రోజులకే సరిపడా నిల్వలుండడం ఆందోళన కలిగిస్తున్నది. కాంగ్రెస్ సర్కారు ముందుచూపు లేని కారణంగానే ఈ దుస్థితి దాపురించగా, మున్ముందు పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారుతున్నది.

### పది రోజుల తర్వాత ఎలా..?

మంచిర్యాల జిల్లా కల్పతరువు ఎల్లంపల్లి ప్రాజెక్టులో రోజురోజుకూ నీటి మట్టం తగ్గిపోతుండగా, మున్ముందు మంచిర్యాల జిల్లా వాసులకు తాగునీటి తిప్పలు తప్పేలా లేవు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో కేవలం నాలుగు టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీరు కూడా కేవలం పది రోజులే వినియోగించుకునే అవకాశం ఉండడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ప్రతిరోజూ మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాలకు సంబంధించిన 330 గ్రామాలు, ఆరు మున్సిపాలిటీలకు 23 క్యూసెక్కులు, ఇదే ఎల్లంపల్లి నుంచి జీహెచ్ఎంసీ వాటర్ సప్లై స్కీమ్‌కు 308 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 242 క్యూసెక్కులు, రామగుండం గ్రిడ్‌కు 58 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతమున్న నీటిని కేవలం తాగు నీటి అవసరాలకే వాడుతుండగా, ఇలాగే వినియోగిస్తే కేవలం పది రోజులకే సరిపోతుంది. ఇప్పటికే నీటి నిల్వలు అడుగంటడంతో గతంలోనే ఒక కెనాల్‌ను తీసి ఇంటేక్‌వాల్ ద్వారా నీటిని సరఫరా చేశారు. ఇప్పుడు మరో కాల్వ తీసి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్‌కు చేరుకొని తాగునీటికి కష్టాలు తప్పేలా లేవు.

### నాడు నిండు కుండలా.. నేడు వెలవెల

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిప్పటి నుంచి నిండు కుండలా దర్శనమిచ్చిన ఎల్లంపల్లి ప్రాజెక్టు, ప్రస్తుతం నీరు లేక వెలవెలబోయే పరిస్థితి దాపురించింది. గతేడాది ఇదే పరిస్థితి ఏర్పడగా, కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సకాలంలో నీటిని ఎత్తపోయడం, వర్షాలు కురియడంతో తాగునీటి సమస్య ఉత్పన్నం కాలేదు. కాంగ్రెస్ సర్కారు కాళేశ్వరం ప్రాజెక్టుకు త్వరగా మరమ్మతులు చేసి గోదావరి నీటిని ఎత్తిపోసినట్లయితే ప్రస్తుతం ఈ పరిస్థితి ఉండేది కాదని ప్రజలు మండిపడుతున్నారు. గతేడాది నీటితో కళకళలాడిన ప్రాజెక్టు.. నేడు నాలుగు టీఎంసీలకే పరిమితం కావడం.. అదీ కూడా కొద్ది రోజులకే నీటిని వినియోగించుకునేలా ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. జిల్లా నీటి కష్టాల వైపు వెళ్తుండడంతో మంచిర్యాల జిల్లా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ దీపక్ కుమార్ కూడా ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వలపై ఆరా తీశారు. మంచిర్యాలతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణాలకు తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పంప్‌హౌస్ లోకి ఎల్లంపల్లి నుంచి నీటిని మళ్లిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి నీటి మళ్లింపు పనులు జరుగుతున్నాయి. ప్రజలకు తాగు నీటి సమస్య ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాజెక్టులోని నీటి నిల్వలు, నీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు వివరించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### నీటికి ఇబ్బంది లేదు

ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు వారం.. పది రోజులకు వరకు సరిపోతాయి. వర్షాలు పడకపోతే ఇబ్బందులుండవద్దని ముందస్తుగా కాలువలు తవ్విస్తున్నాం. ఇప్పటికే ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి. దీనికితోడు కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తున్నందున అక్కడి నుంచి వరద ప్రాజెక్టులోకి వస్తుంది. నీటి కొరత ఏమీ ఉండదు.

- కృష్ణ, మిషన్ భగీరథ డీఈఈ

## పంప్‌హౌస్‌కు నీటి మళ్లింపు పనులు ప్రారంభం

**పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్**


ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలటౌన్, జూన్ 27: ముల్కల్లలోని మిషన్ భగీరథ పంప్‌హౌస్‌కు గోదావరి నీటి ప్రవాహాన్ని తరలించే పనులను గురువారం మున్సిపల్‌చైర్మన్ రావుల ఉప్పలయ్య ప్రారంభించగా, కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. మంచిర్యాలతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణాలకు తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పంప్‌హౌస్ లోకి ఎల్లంపల్లి నుంచి నీటిని తీసుకుంటున్నారు. కొన్నిరోజులుగా పంప్‌హౌస్ దగ్గరకు నీరు అందడం లేదు. దీంతో అవసరాలకు సరిపడా తాగు నీటిని సరఫరా చేయలేక పోతున్నారు. దీంతో పాలకులు, అధికారులు తక్షణమే గోదావరి నదిలో అవతల వైపునకు ఉన్న నీటి ప్రవాహాన్ని పంప్‌హౌస్ వద్దకు మళ్లించడమే మార్గంగా భావించారు. ఇందుకు సంబంధించి రెండు ఎక్స్‌కవేటర్లు ఉపయోగించి గోదావరిలో దక్షిణ భాగాన ఉన్న నీటి ప్రవాహాన్ని ఉత్తర భాగాన ఉన్న మిషన్ భగీరథ్ పంప్‌హౌస్ వద్దకు ట్రెంచ్ కొట్టి తరలించారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలోని మిషన్ భగీరథ్ పంప్‌హౌస్ వద్దకు వెళ్లి పనులు పరిశీలించారు. ఇప్పటి వరకు ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మహేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గనుల ప్రైవేటీకరణకు కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు

**బీఆర్ఎస్ కాపాడితే.. ఆ పార్టీలు అమ్మేసే కుట్ర చేస్తున్నాయి**


సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు, టీబీజీకేఎస్ నాయకులతో మాట్లాడుతున్న కేటీఆర్

- కేసీఆర్ సర్కారు తట్టెడు బొగ్గు కూడా తీయనివ్వలే
- సకల జనుల సమ్మె స్ఫూర్తితో పోరాడి సింగరేణిని కాపాడుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారాకరామారావు
- తెలంగాణ భవన్‌లో 11 ఏరియాల బీఆర్ఎస్ ప్రతినిధులు, నాయకులతో సమావేశం

శ్రీరాంపూర్, జూన్ 27 : బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై సింగరేణి గనులను ప్రైవేట్ పరం చేసే కుట్రల చేస్తున్నాయని, బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జిలు, టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులతో కలిసి పోరాటానికి సిద్ధం కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారాకరామారావు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 11 ఏరియాల బీఆర్ఎస్ ప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన అందరి అభిప్రాయాలు విన్నారు. ఆపై మాట్లాడుతూ పదేళ్లపాలనలో కేసీఆర్ ప్రైవేట్ సంస్థలను సింగరేణివైపు కన్నెత్తి కూడా చూడనివ్వలేదని, బీఆర్ఎస్ సర్కారు కాపాడితే.. ఇప్పుడు ఆ రెండు పార్టీలు అమ్మేయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. సీఎం రేవంత్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ గనుల వేలానికి సహకరిస్తున్నాడని, గనుల వేలం వల్ల సింగరేణిని నష్టాల్లో చూపించి నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ ప్రాజెక్టులను కట్టే బాధ్యతలను బీహెచ్ఎల్‌కి అప్పగించామన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేసిన మేలు, హక్కులు తెలుసన్నారు. రెండు బొగ్గు బ్లాకులను టెండర్ల ద్వారా అప్పగించినప్పటికీ తట్టెడు బొగ్గును తీయనివ్వలేదన్నారు. కాంగ్రెస్ గెలిచి ఆరు నెలలైనా కాకముందే బీజేపీ ఎంపీలు, కాంగ్రెస్ నాయకులు కలిసి వేలంలో పెట్టారని మండిపడ్డారు. ఆనాడు సింగరేణి కార్మికులు తెలంగాణ కోసం సకల జనుల సమ్మె చేసి అప్పటి కేంద్ర సర్కారును కదిలించారని, అదే స్ఫూర్తితో తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సింగరేణి సంస్థ పరిరక్షణకు, కార్మికుల ఉద్యోగ భద్రతకు, బీఆర్ఎస్ అండగా ఉంటుందనే భరోసాను కార్మికులకు బీఆర్ఎస్ ప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు కల్పించాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, చిన్నయ్య, నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, కేంద్ర కమిటీ నాయకుల కే సురేందర్‌రెడ్డి, ఏరియా ఇన్‌చార్జి లక్ష్మణ్, నాయకులు పొగాకు రమేశ్, పానుగంటి సత్తయ్య, అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మా గనులు మాకే కావాలి


తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

- ఒక్క బొగ్గు పెల్లనూ తీయనివ్వం
- కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- కార్మికులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలి
- జూలై ఒకటి నుంచి ఆందోళనలు
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

శ్రీరాంపూర్, జూన్ 27 : మా గనులు.. మా సింగరేణికే కావాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుతో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ కలిసి చర్చించిన అనంతరం టీబీజీకేఎస్ ఉద్యమ-పోరాట కార్యాచరణను ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలోనే సింగరేణి గనుల ప్రైవేటీకరణ, వేలం టెండర్లను వ్యతిరేకిస్తూ సమ్మె పోరాటం చేశామన్నారు. ఎవరైనా గనుల వేలంలో పాల్గొని సింగరేణి గడ్డపై అడుగు పెడితే.. ఒక్క బొగ్గు పెల్లను కూడా తీయనివ్వబోమని హెచ్చరించారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామంటూనే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వేలం ప్రారంభోత్సవానికి ఎలా హాజరవుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సింగరేణిపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో గనుల ప్రైవేటీకరణ, వేలాన్ని వ్యతిరేకిస్తూ, సింగరేణికే గనులు అప్పగించాలని తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సర్కారులో టీబీజీకేఎస్ సింగరేణిని కాపాడేందుకు పోరాటాలు చేసిందని, కార్మికులంతా ఏకమై మరో ఉద్యమానికి సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండీఆర్ యాక్టు-17 ఏ. సెక్షన్-2 ప్రకారం రాష్ట్ర ప్రభు త్వం అనుమతి లేకుండా కేంద్ర ప్రభుత్వం వేలం, ప్రైవేటీకరణ చేయడానికి అధికారం లేదన్నారు.

### జూలై ఒకటి నుంచి ఆందోళనలు

జూలై 1 నుంచి 9వ తేదీ వరకు సింగరేణి వ్యాప్తంగా టీబీజీకేఎస్, బీఆర్ఎస్ ప్రతినిధులతో కార్మికులు గనుల ప్రైవేటీకరణ, వేలాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమ పోరాటాలు చేపడుతామని రాజిరెడ్డి పేర్కొన్నారు. జూలై 1న సింగరేణి వ్యాప్తంగా గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్‌లపై కార్మిక వర్గం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపడుతుందన్నారు. 3న కేంద్రం, రాష్ట్ర కాంగ్రెస్ దిష్టి బొమ్మలు దహనం చేస్తామన్నారు. 6న జీఎం కార్యాలయాల ముందు ధర్నాలు చేపట్టి, జీఎంలకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. 9న గోదావరిఖనిలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారన్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఎంపీలకు అసెంబ్లీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని వినతి పత్రాలు అందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగిరాకపోతే అసెంబ్లీ, ఇందిరా పార్కు ముందు ధర్నా, నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్మిక వర్గాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి పార్లమెంటు ముట్టడి, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామన్నారు. కలిసి వచ్చే పార్టీలు, యూనియన్లను కలుపుకొని పోరాటాలు చేస్తామని, కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. టీబీజీకేఎస్ కేంద్ర నాయకులు కే సురేందర్ రెడ్డి, కొమురయ్య, రామ్మూర్తి, ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, నాయకులు పానగంటి సత్తయ్య, రమేశ్, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## వర్షాల కోసం కప్పతల్లి ఆట

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 27: వర్షాలు సమృద్ధిగా కురిసి.. పంటలు బాగా పండాలని కోరుతూ గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా అగ్రి ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కప్పతల్లి ఆడారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కప్పతల్లిని ఊరేగించారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో రైతులంతా ఆందోళన చెందుతున్నారని, వరుణ దేవుడు కరుణించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా అగ్రి ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు కవ్వాల మహేందర్, ఉపాధ్యక్షుడు కొండ తిరుపతి, సభ్యులు నరేశ్, నరేందర్, రాజు, సురేశ్, ప్రణయ్, రమేశ్, సంతోష్, సునీల్, ఆనంద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


కప్పతల్లి ఆడుతున్న అగ్రి అసోసియేషన్ సభ్యులు

## నూతన చట్టాలపై అవగాహన అవసరం

- రామగుండం సీపీ శ్రీనివాస్
- ముగిసిన శిక్షణ తరగతులు


శిక్షణ తరగతిలో పాల్గొన్న పోలీస్ సిబ్బందితో సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, జూన్ 27 : దేశంలోని నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిసిన సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూలై ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్ చట్టాలు అమల్లోకి వస్తున్నాయని, ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన ఉండాలనే నెల పాటు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. నూతన చట్టాలతో ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించే వీలు ఉంటుందన్నారు. రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించిన ఏసీపీ మల్లారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐలు రాజేశ్, వినీత, సంతోష్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్, వంశీకృష్ణ, శ్రీనివాస్, రాము, సంతోష్, శ్రీనివాస్, కానిస్టేబుల్ తిరుపతి, శ్రీనివాస్‌కు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679